క్లుప్తంగా

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



నూతన ఎంపీడీవో వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

మందస: మందస ఎంపీడీవోగా నియమితులైన వై.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం మండల పరిషత్ కార్యాలయంలో పరిపాల అధికారిగా పని చేస్తూ పదోన్నతిపై రెగ్యులర్ ఎంపీడీవోగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్ నాయుడు వ్యవహరించారు. నూతన ఎంపీడీవోకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రుషేశ్వరరావు, జయప్రకాశ్, ధనలక్ష్మి తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: కవిటిలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్సీ నర్తు రామారావు స్థానిక ఎంపీపీ కడియాల పద్మతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్న పాపయ్యరెడ్డిని అభినందించారు. ఆలయ నిర్మాణానికి తనవంతుగా 30 బస్తాల సిమెంట్‌కు అవసరమైన నిధులను ఎమ్మెల్సీ రామారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.శేఖర్, ఎం.సీతారాం, ఎ.మధు ఉన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



దుర్గారావుకు సాయాన్ని అందజేస్తున్న ప్రకాష్

కవిటి: శిలగాం పంచాయతీ గుజ్జుపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల దుర్గారావు అనారోగ్యంతో ఇచ్ఛాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కవిటి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్ బాధితుడ్ని శుక్రవారం పరామర్శించి ధైర్యం తెలిపారు. వైద్య ఖర్చుల కోసం దుర్గారావుకు రూ. 11 వేలు అందజేశారు. కొర్రాయి గోపాల్ తదితరులున్నారు.

యాక్సిస్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

టెక్కలి: యాక్సిస్ విద్యుత్ ఒప్పందంతోపాటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టెక్కలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు ఈ రోజు అధికంగా విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని ఆనాడు చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలపై రూ. 15 వేల కోట్ల భారం వేసే విధంగా చేసిన ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఎల్లయ్య, వెంకట్రావు, ధర్మారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం అర్హులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని.. కావాల్సిన వారు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు శుక్రవారం తెలిపారు. కొత్తరేషన్‌కార్డులో చేరేవారి పేరు పాతకార్డులో తొలగింపు, రైస్‌కార్డు సరెండర్, కార్డులో ఆధార్ నంబర్ మార్పు, చిరునామా మార్పు వాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కవిటి: బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి మాణిక్యపురం ఫీడర్‌లో మరమ్మతు పనులు శనివారం చేపట్టనున్నారు. దీంతో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు కవిటి ఏఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..!

- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో యూపీహెచ్‌సీల దుస్థితి
- పట్టించుకోని నాయకులు, అధికారులు



పిచ్చి మొక్కల మధ్య విలువైన భవనం



మొగిలిపాడులో నిరుపయోగంగా ఉన్న యూపీహెచ్‌సీ భవనం

కాశీబుగ్గ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మారుమూల పల్లె వాసులకు సైతం వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీలను ఏర్పాటు చేసింది. ఇదే తరహాలో పట్టణ వాసులకు సైతం స్థానికంగానే వైద్యసేవలు అందించేందుకు వీలుగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యూపీహెచ్‌సీ)లను ఏర్పాటు చేసింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మూడు అర్బన్ హెల్త్‌సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటిలో రెండు భవనాలను పూర్తి చేసింది. ఒక భవనం పనులు వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయాయి. అయితే నిర్మించిన భవనాలను మాత్రం కూటమి ప్రభుత్వం ప్రారంభించలేదు. ఫలితంగా విలువైన ఈ భవనాలు ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. అందుబాటులో భవనాలు ఉన్నప్పటికీ వీటిని వినియోగించుకోకుండా ప్రైవేటు భవనాల్లో యూపీహెచ్‌సీలను నిర్వహిస్తున్నారు.

అందించాల్సిన సేవలు..

అర్బన్ హెల్త్ సెంటర్లను పూర్తి డిజిటలైజేషన్ చేశారు. పీహెచ్‌సీలను పోలినటువంటి ఈ కేంద్రాలలో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. వైద్యులు, ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్, నర్సులు, ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలు సేవలు అందిస్తారు. వీరేకాకుండా టెలి మెడిషన్ పద్ధతుల్లో సంబంధిత స్పెషలిస్టు రోగి ఆరోగ్య సమస్యలను ఆన్‌లైన్ ద్వారా విని వైద్య సలహాలు అందిస్తారు. ఉచిత వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించాల్సి ఉంటుంది.

దిష్టిబొమ్మల్లా..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి మూడు అర్బన్ హెల్త్‌సెంటర్‌లు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. వీటిలో రెండు పూర్తవ్వగా.. ఒకటి స్థల వివాదం కారణంగా మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. ఒకటో వార్డు జాతీయ రహదారికి సమీపంలోని మొగిలిపాడు గ్రామం వద్ద, మరొకటి కోసంగిపురం సమీపంలో ఒక్కో భవనాన్ని రూ. 85 లక్షలతో నిర్మించారు. సూదికొండ వద్ద భవన నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ స్థల వివాదంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. పూర్తయిన భవనాలను కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ప్రారంభించకపోవడంతో పాడవుతున్నారు. భవనాల చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. కిటికీలు, తలుపులకు చెదలు పడుతున్నాయి. ఇప్పటికైనా వైద్యాధికారులు, నాయకులు శ్రద్ధ తీసుకొని విలువైన ఈ భవనాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సమీక్షించి ప్రారంభిస్తాం..

మున్సిపాలిటీ పరిధిలో మూడు మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయి. అందులో మొగిలిపాడు, కోసంగిపురం సమీపంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో భవనాల పనులు పూర్తి అయ్యాయి. అయితే భవనాలకు సంబంధించి నగదు లావాదేవీల సమస్య ఉండటంతో సంబంధిత అధికారులు తమకు అప్పగించలేదు. సూదికొండలో నిర్మాణంలో ఉన్న భవనం పనులు నిలిచిపోయాయి. వీటన్నింటిపై స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం ప్రారంభానికి రంగం సిద్ధం చేస్తాం. అంతవరకు వాటి నిర్వహణ ప్రైవేటు భవనాల్లో చేపడుతున్నాము.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

నవధాన్యాల కిట్ల పంపిణీ



నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతోందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు–నేల తల్లిబాగు కార్యక్రమంలో భాగంగా పలాసపురం గ్రామంలో నవధాన్యాల కిట్లను శుక్రవారం తయారీ చేసి రైతులకు పంపిణీ చేశారు. నవధాన్యాల సాగుతో నేలలో కర్బన్‌శాతాలు పెరుగుతాయని రైతులకు సూచించారు. నవధాన్యాల సాగుకు ఆసక్తి చూపించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి కుమారి, ఏపీఎం రమణమ్మ, ఐసీఆర్‌పీలు కృష్ణవేణి, శ్రావణి పాల్గొన్నారు. – సోంపేట

పార్సిల్ విభాగం పరిశీలన



తక్కువ రవాణా చార్జీలతో ఆర్టీసీ నిర్వహిస్తున్న పార్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ సహాయక మేనేజర్ (పార్సిల్ విభాగం) డి.దివ్య కోరారు. శుక్రవారం టెక్కలి ఆర్టీసీ డిపో ఆవరణలో గల పార్సిల్ విభాగాన్ని పరిశీలించారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో సరుకులను రవాణా చేస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. టెక్కలి, శ్రీకాకుళం డిపో మార్కెట్ ఎగ్జిక్యూటివ్‌లు ఎస్.ఆర్.కుమార్ తదితరులు ఉన్నారు. – టెక్కలి

మురుగునీటితో అవస్థలు



టెక్కలిలోని ఆది ఆంధ్రావీధిలో రోడ్డుపై మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండి పోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందు నిల్వ ఉండిపోతుందని వాపోతున్నారు. తేలిక పాటి వర్షానికి కూడా వీధి రోడ్డుపై నీరు నిలిచిపోతున్నట్టు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – టెక్కలి రూరల్

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మళ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, ఫిజీషియన్స్, విద్యార్థులు, న్యాయ సంబంధిత విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సామాజిక సేవా దృక్పథం ఉన్నవారు, మైత్రీ సంఘం సభ్యులు, ఇతర స్వయం సహాయక సంఘం సభ్యులు, విభిన్నమైన సామర్థ్యం గల వ్యక్తులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్లు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, విద్యార్హత సంబంధిత పత్రాలతో ఈ నెల 14వ తేదీలోగా సంప్రదించాలన్నారు. నియమితులైన అభ్యర్థులకు ఎటువంటి జీత భత్యములు, పారితోషకములు, వేతనాలు చెల్లించబడవని స్పష్టం చేశారు.

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పారా లీగల్ వీలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జడ్జి ఎం.రోషిణి ఓ ప్రకటనలో తెలిపారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ, జలుమూరు మండలాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాలకులకు పట్టని డయాలసిస్ కేంద్రం!

- ప్రారంభానికి నోచుకోని వైనం



ప్రారంభానికి నోచుకోని డయాలసిస్ కేంద్ర భవనం



డయాలసిస్ హాల్

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో కిడ్నీ రోగుల కోసం ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఉద్దానం ప్రాంతంలోని మూత్ర పిండాల వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉంటుందనే ఉద్దేశంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తొలి దశలో ఐదు పడకలతో సేవలు అందించాలనే ఉద్దేశంతో అందుకుతగ్గట్టుగా సౌకర్యాలు కల్పించింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభించలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ కేంద్రాన్ని ప్రారంభించకుండా కాలయాపన చేస్తోంది. దీంతో కిడ్నీ రోగులు డయాలిసిస్ సేవల కోసం దూరంగా ఉన్న సోంపేట, కవిటి వెళ్లాల్సి వస్తుంది. ఫలితంగా ఆర్థికంగా నష్టపోవడంతోపాటు వెళ్లిరావడానికి అవస్థలు పడుతున్నామని కిడ్నీ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు శ్రద్ధ తీసుకొని ఈ కేంద్రాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది పడుతున్నా..



తాను మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాను. వారానికి ఒకసారి డయాలిసిస్ కోసం కవిటి, సోంపేట వెళ్లాల్సి వస్తుంది. గతంలో అత్యవసర పరిస్థితిలో 108 వాహనం వచ్చేది. ఇప్పుడు ఆ సౌకర్యం లేదు. దీంతో ఆటో, కారులో వెళ్లాల్సి వస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలి.

– అంకుల హరికృష్ణ, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు, ఇచ్ఛాపురం

ఆదేశాలు వస్తే ప్రారంభిస్తాం..



ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో డయాలిసిస్ కేంద్రంలో రోగులకు సేవలు అందించేందుకు అన్ని సిద్ధంగా ఉన్నాయి. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే దీన్ని ప్రారంభిస్తాం.

– డాక్టర్ దేవేంద్రరెడ్డి, వైద్యాధికారి, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, ఇచ్ఛాపురం

‘సిందూర్’కు సంఘీభావంగా ర్యాలీ



ఇచ్ఛాపురం: సంఘీభావ ర్యాలీలో ఎమ్మెల్సీ రామారావు తదితరులు



కవిటి: ర్యాలీ చేస్తున్న చింతామణి కాలనీవాసులు

ఇచ్ఛాపురం: పాకిస్తాన్ ఉగ్రమూకలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన సైనిక చర్య అభినందనీయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ముఖద్వారం నుంచి పాతజాతీయ రహదారి గుండా బస్టాండ్ కూడలి వరకు భారతదేశ సైనికులకు సంఘీభావంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. దేశరక్షణలో భారతీయ త్రివిధ దళాల వీరోచిత పోరాట పటిమ ఎనలేనిదన్నారు. ప్రతీపౌరుడు దేశ భక్తిని కలిగి దేశానికి అవసరమయ్యే సమయంలో ఒక సైనికునిగా దేశసేవ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, నాయకులు నర్తు నరేంద్ర, కారింగ మోహన్ రావు, బచ్చు జగన్, ప్రేమ్, సల్లా దేవరాజు, గాంధీ, బి.మహేష్, హంగీర్ బెహర పాల్గొన్నారు.

కవిటి: భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఉగ్రమూకల పీచమణచడంలో భారతీయసైన్యం చూపుతున్న ధైర్య సాహసాలు ప్రశంసనీయమైనవని కవిటి చింతామణి కాలనీకి చెందిన పలువురు చిన్నారులు, యూత్ నినదించారు. ఈ మేరకు కవిటిలో భారీర్యాలీ నిర్వహించారు. పెహల్గాం మృతులకు ఘననివాళులు అర్పిస్తూ వారి ఆత్మశాంతి కోసం సిందూర్ ఆపరేషన్ పేరిట మన దేశ సిపాయిలు చూపుతున్న ధైర్య సాహసాలు, ప్రాణత్యాగాలు వెలకట్టలేనివని వారు నినదించారు.

యువజన సంఘాల పాత్ర కీలకం



యువజన సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో యువజన సంఘాల పాత్ర కీలకమని.. అందులో జిల్లాలోనే ఉషోదయ సంఘం ఉత్తమ పనితీరు చూపిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. కవిటిలోని ఉషోదయ యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి యువజన సంఘ సభ్యులు తమవంతు కృషి చేయాలన్నారు. సంఘ అధ్యక్షునిగా ఆరంగి కృష్ణారావు, ఉపాధ్యక్షునిగా చక్రధర్, కార్యదర్శిగా పి.రుద్రయ్యతో పాటు పలువురు కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా.. ఎంపీపీ కడియాల పద్మ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

తాటిముంజులకు గిరాకీ



విక్రయానికి ముంజులను సిద్ధం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: ఏడాదిలో వేసవిలో మాత్రమే లభ్యమయ్యే తాటి ముంజులకు గిరాకీ పెరిగింది. కొద్ది రోజులుగా ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొంతమంది తాటికాయలను తీసుకొచ్చి..వాటి నుంచి ముంజులను తీసి విక్రయిస్తున్నారు. డజను ముంజులు సుమారుగా 60 రూపాయలకు విక్రయిస్తుండగా.. వీటిని కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు



సామూహిక కుంకుమార్చన పూజల్లో మహిళలు

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ కోదండరామాలయం, కవిటి పట్టాభిరామాలయాలలో శుక్రవారం వైశాఖ మాస తిరుక్కల్యాణమహోత్సవాలు వైభవంగా జరిగాయి. పాంచరాత్ర ఆగమంలో బ్రహ్మపురానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రగడపుట్టుగలో మహిళలచే సామూహిక కుంకుమార్చనలు సంప్రదాయబద్ధంగా జరిగాయి.

ప్రారంభమైన బిడిమి చండేశ్వరి సంబరాలు



బిడిమి చండేశ్వరి అమ్మవారు

మందస: బిడిమి గ్రామంలోని బిడిమి చండేశ్వరి సంబర మహోత్సవాలు శుక్రవారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 13వ తేదీ వరకు సంబరాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా ముక్తేశ్వర ఆలయ ప్రతిష్ట

మందస: మూలిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన ముక్తేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజున స్వామివారిని తిరువీధి నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

కిశోరీ వికాసంపై బాలికలకు అవగాహన

కవిటి: మండల కేంద్రం కవిటి ఐసీడీఎస్ సెక్టార్ పరిధి డొంకపుట్టుగ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన శుక్రవారం కల్పించారు. శారీరక ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు.

ఎమ్మెల్యేకు బార్ అసోసియేషన్ వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాశీబుగ్గ: పలాసలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు భవనాలు మంజూరు చేసి నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కోర్టు భవనం కోసం రూ.5.90 కోట్లు నిధులు మంజూరయ్యాయని.. అయితే పనులు ప్రారంభం కాలేదని వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి.ఫైయజ్, ఉపాధ్యక్షులు బి.ఆర్.కె.పట్నాయక్, సభ్యులు రజనికుమార్, జి.ప్రభాకర్, పి.చిట్టిబాబు, టి.శామ్, రవికుమార్ ఉన్నారు.